ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
గురువారం 27 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (గురువారం సాయంత్రం)
సహర్ 4:55 (శుక్రవారం ఉదయం)

పేదలకు సన్న బియ్యం



ఎంఎల్‌ఎస్ పాయింట్లలో సన్నబియ్యం దింపుతున్న కూలీలు

- ఏప్రిల్ ఒకటి నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- రేషన్‌కార్డుదారులకు సర్కారు ఉగాది కానుక
- ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్దకు నిల్వలు
- నెలాఖరులోపు డీలర్ పాయింట్‌కు..
- జిల్లాలో రేషన్ కార్డులు 3,07,127

జగిత్యాల, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకొని రాష్ట్రప్రభుత్వం పేదలకు తీపికబురు అందించింది. ఆహార భద్రత కార్డుదారులకు ఏప్రిల్ ఒకటోతేదీ నుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు పౌర సరఫరాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం రేషన్ డీలర్లవద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యం మొత్తం వెనక్కి పంపించాలని ఆదేశించింది. ఈ మేరకు అవసరమైన చర్యలు ముమ్మరం చేసింది. సర్కారు తాజా నిర్ణయంతో సన్నబియ్యం కొనుగోలు చేయలేని పేదలకు ప్రయోజనం చేకూరనుంది. అక్రమంగా సాగుతున్న రేషన్ బియ్యం దందాకు చెక్‌పడే అవకాశముంది. ఉగాది రోజు సూర్యాపేటలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంచనప్రాయంగా ప్రారంభించనున్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీని నిర్వహించనున్నారు.

● ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు..

జిల్లాలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు అధికారులు సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సన్నబియాన్ని రేషన్‌దుకాణాలకు పంపుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని సుమారు 152 రేషన్ దుకాణాలకు సన్నబియ్యం సరఫరా పూర్తి చేశారు. మిగిలిన రేషన్ దుకాణాలకు సైతం సాధ్యమైనంత తొందరలో సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అవసరమైన పక్షంలో ఇతర జిల్లాల నుంచి సైతం సన్నబియ్యం దిగుమతి చేసుకొని రేషన్ దుకాణాలకు పంపేందుకు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో సన్నరకం ధాన్యం కేటాయింపులు జరిగిన మిల్లుల నుంచి సీఎంఆర్‌ను రోజువారీగా సేకరించి రేషన్ దుకాణాలకు పంపిణీ చేసే ప్రయత్నంలో సివిల్ సప్లయిస్‌శాఖ అధికారులు ఉన్నారు.

జిల్లాలో రేషన్ కార్డుల వివరాలు...

మొత్తం రేషన్ కార్డులు	- 3,07,127
కార్డుల్లోని యూనిట్లు	- 8,82,187
ఆహార భద్రత కార్డులు	-2,92,450
అన్నపూర్ణ కార్డులు	-145
అంత్యోదయ కార్డులు	-14,532
జిల్లాలో రేషన్ దుకాణాల సంఖ్య	-592
బియ్యం కోటా (మెట్రిక్ టన్నులు)	-5,578.600

● అక్రమ దందాకు చెక్

ఆహారభద్రత కార్డుదారులకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా వ్యక్తికి ఆరుకిలోల చొప్పున బియ్యం అందజేస్తుంది. అవి దొడ్డువి కావడంతో చాలా మంది వీటిని తినడానికి ఇష్టపడడం లేదు. అలాంటి వారు తమకు రావాల్సిన కోటా బియ్యాన్ని డీలర్లకే కిలో రూ.13 నుంచి రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని డీలర్లు వ్యాపారులకు రూ.20 నుంచి 22రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. మరికొంత మంది బియ్యాన్ని నెలల తరబడి నిల్వచేసి తమ ఇంటి వద్దకు ఆటోలతో వచ్చే వారికి అమ్ముతున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని దళారులు, వ్యాపారులు కలిసి మహారాష్ట్రకు లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలున్నాయి. తాజాగా సన్న బియ్యం పంపిణీ ద్వారా ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● కొత్త కార్డుదారులకు లేనట్లేనా...?

సర్కారు నిర్ణయంపై ఆహార భద్రతకార్డుదారుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా కొత్తకార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే మిగులుతుంది. కొత్త కార్డులజారీ ప్రక్రియ శ్రీకారం చుట్టిన ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా మండలానికి ఒక గ్రామం చొప్పున కొంత మందికి మాత్రమే జారీ చేసింది. జిల్లాలో 19,974 నూతనరేషన్ కార్డులను, 49,899 మందిని రేషన్ కార్డులలో కొత్త వ్యక్తులను నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే వీరందరికి కార్డులుజారీ కాలేదు. మండలానికి ఒక గ్రామంలో మాత్రమే పంపిణీ చేశారు. వాటికి బియ్యం కోటా కూడా విడుదల చేసింది. మిగతా గ్రామాల వారికి కార్డుల జారీచేయాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. కార్డుల రాకపోవడంతో వారికి సన్నబియ్యం పొందే అవకాశం లేకుండా పోతోంది.

● రేషన్ డీలర్లతో అధికారుల సమీక్ష.

ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీపై జిల్లా ఉన్నతాధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు డీలర్లతో సమీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు రేషన్ షాపుల్లో ఉన్న దొడ్డు బియ్యం లెక్కలు ఒకటి, రెండు రోజుల్లో తేల్చి వాటిని నిల్వ చేయాలని సూచించారు. అవసరం మేరకు సన్న బియ్యం ఆర్వోలు తీసుకొని ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి ..

మిగతా 8లో..

ఈజీఎస్ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

● అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్


పోసానిపేటలో కూలీల హాజరును పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ

కథలాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పని ప్రదేశాల వద్ద కూలీలకు అన్నిరకాల వసతులు కల్పించాలని జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్ సూచించారు. మండలంలోని పోసానిపేటలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మండిపోతున్న నేపథ్యంలో పనులు జరిగేచోట తాగునీరు, ఎండకు నీడ కోసం టార్పాలిన్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. కూలీల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. పనులను త్వరితగతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపికైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన దశల్లో డబ్బుల చెల్లింపు ఉంటుందన్నారు. కూలీల హాజరు నమోదుకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి సులోచన పాల్గొన్నారు.

ఈద్గాలో వసతులు కల్పించాలి


ఈద్గాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ శివారులోని ఈద్గాలో ప్రార్థనల కోసం వసతులను కల్పించాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈద్గాను బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పట్టణ శివారులోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని ఈద్గాను పరిశీలించి పారిశుధ్య పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ క్రాంతి కుమార్, డీఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నూతన పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేయాలి

● శాసనమండలిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నూతనంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు అయిన పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శాసన మండలిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినప్పటికీ భూముల హద్దులు, సర్వే నంబర్ల వారీగా పట్టా భూముల విషయంలో జిల్లా రెవెన్యూశాఖ పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టకపోవడంతో కొత్త పంచాయతీలకు ఆదాయం రావడం లేదని వివరించారు. భూముల క్రయ విక్రయాలు రైతులు చేసినప్పుడు ఆదాయం పాత పంచాయతీలకు వెళ్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూశాఖ ప్రత్యేక చొరవ తీసుకొని కొత్త పంచాయతీలోని భూముల సర్వే నంబర్లను డీలిమిటేషన్‌చేసి రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలన్నారు. అంతేగాకుండా కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేయకపోవడంతో పక్కనున్న పాత పంచాయతీలకే ప్రజలు రేషన్ సరకుల కొరకు వెళ్తున్నారన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం నూతన పంచాయతీలు ఏర్పాటు చేసినప్పటికీ మౌలిక సౌకర్యాలతో పాటు అభివృద్ధి, ఆదాయ మార్గాలు చూపించాల్సిన అవసరముందన్నారు. జగిత్యాల మున్సిపాలిటీ పరిధి విస్తరణలో భాగంగా సమీపంలోని నర్సింగాపూర్, నూకపల్లి గ్రామంలోని పలు సర్వే నంబర్లు మున్సిపాలిటీలో కలపాలని ఎమ్మెల్సీ ప్రభుత్వాన్ని కోరారు.

కోళ్ల పెంపకంతో రైతులకు రాబడి

● పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్


కోళ్ల పెంపకందారులతో పశువైద్య కళాశాల ప్రొఫెసర్లు

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బ్రాయిలర్ కోళ్ల పెంపకంతో రైతులకు రాబడి పెరుగుతుందని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పశువైద్య కళాశాలలో బ్రాయిలర్ కోళ్ల పెంపకం దారులకు ఆర్థిక చేయూత అనే అంశంపై నిర్వహించిన శిక్షణ తరగతులను జిల్లా షెడ్యూల్ తెగల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్‌తో కలిసి అసోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ ప్రారంభించారు. అ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం కోళ్ల పరిశ్రమ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అద్భుతమైన పురోగతిని సాధించిందని అన్నారు. కోడి మాంసం, కోడి గుడ్ల వినియోగం పెరిగిపోయిందని అన్నారు. రానున్న రోజులలో మరింత పెరిగే అవకాశం ఉన్నందున్న పెంపకం దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ దైద కృష్ణ, డాక్టర్ పరుశురాములు, డాక్టర్ రవికాంత్, డాక్టర్ సురేష్, డాక్టర్ కీర్తన, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అనితలతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ధర్మపురి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 27న గురువారం 11 గంటలకు జరుగుతుందని సీఈవో అయ్యోరు రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో పంట అప్పులు, దీర్ఘకాలిక రుణాలు వసూళ్లు, సంఘం లావాదేవీల పట్టికలను సమర్పించుట, ఆమోదించడంపై చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆస్తి, అప్పుల గురించి, సభ్యుల నుంచి డిపాజిట్ల సేకరణ గురించి చర్చిస్తామని ఆయన తెలిపారు. సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించకుండా చర్యలు

కలెక్టర్ బి. సత్యప్రసాద్


నర్సింగాపూర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వస్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఆక్రమణకు గురైన 90ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో సర్వేనంబర్ 251, 437 సర్వేనంబర్లకు సంబంధించి 90ఎకరాల్లో ప్రభుత్వ అసైన్‌ల్యాండ్‌పై సర్వే చేపట్టామన్నారు. సర్వే తర్వాత ఏవైతే పట్టా అయిన భూములు ఉన్నాయో అవన్నీ పీఓటీ యాక్ట్ కింద రద్దు చేశామని కలెక్టర్ తెలిపారు. 90 ఎకరాల్లో ప్రభుత్వ స్థలంలోని సర్వేనంబర్ 437, 251లలో ఆన్‌రికార్డుపరంగా ప్రభుత్వం రికవరీ చేసుకుందని తెలిపారు ప్రభుత్వపరంగా గవర్నమెంట్ ల్యాండ్ జాబితాలో ఉందన్నారు. ఇతరులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ కాదని తెలిపారు. మొత్తం ల్యాండ్ ప్రభుత్వ రికార్డు జాబితాలో ఉందన్నారు. గ్రౌండ్ లెవల్‌లో పరిశీలించామని ఎవరైతే స్థలం కొన్నవారు ఇతరులకు అమ్ముకోవడాన్ని గుర్తించామన్నారు. వాళ్లు ఇక్కడ ఇటుక బట్టి వ్యాపారం చేయడాన్ని ప్రత్యక్షంగా చూశామన్నారు. ప్రభుత్వపరంగా వాళ్లందరికి ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామన్నారు. 48గంటలలోపు ప్రభుత్వ స్థలం ఖాళీ చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ పీఓటీ యాక్ట్ ప్రకారం ప్రభుత్వస్థలంలో వ్యాపారాలు చేస్తున్నందుకు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు జప్తుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి ఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

మహిళల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

● జిల్లా సంక్షేమాధికారి నరేష్


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి నరేష్

జగిత్యాల అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కులకు భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమాధికారి బొనగిరి నరేష్ అన్నారు. బుధవారం జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ మరియు మహిళల హక్కులు, లింగ సమానత్వం మరియు కమ్యూనిటీ మొబిలైజేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా హక్కులు, మహిళా సాధికారత బృందం చేస్తున్న కార్యక్రమాను వివరించారు. అనంతరం మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ అశ్విని మాట్లాడుతూ మహిళల హక్కులు, లింగ సమానత్వం, గురించి వివరించారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో గురించి, ఆర్థిక అక్షరాస్యత, సఖీ అందించే సేవలను వివరించారు. పోక్సో చట్టం-2012, పనిచేసే చోట లైంగిక వేధింపులు తదితర చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మమత, పోషణ్ అభియాన్ జిల్లా కో- ఆర్డినేటర్ మధు, స్వప్న, గౌతమి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

● అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నరేందర్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి సూచించారు. జగిత్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అల్ఫోర్స్ విద్యానగర్, కృష్ణానగర్ బ్రాంచ్‌లలోగల విద్యా సంస్థల వార్షికోత్సవాలను ల్యూమినస్ పేరుతో నిర్వహించారు. ఈ వేడుకలకు నరేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. పోషకులు వారి పిల్లలతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా యువత బెట్టింగ్‌యాప్‌ల ద్వారా తీవ్రంగా నష్టపో వడమే కాకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు మనం గమనిస్తున్నామన్నారు. అనంతరం వార్షిక ప్రణాళికలో భాగంగా పాఠశాల స్థాయిలో నిర్వహిం చినటువంటి వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు పోషకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కథలాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పిడుగు సంజీవ్ రెడ్డి తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కథలాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖసహాయమంత్రి బండి సంజయ్ కుమార్ కోటా నుంచి మంజూరైన రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. మర్రవ్వ దేవాలయం వద్ద ఈ పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధర్మపురి జలందర్, మాజీ వైస్ ఎంపీపీ బండ అంజయ్య, పాలెపు నరేశ్, పడకంటి గంగాధర్, లోక్యానాయక్, యాటకార్ల అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల భద్రతకు 'మై ఆటో ఈజ్ సేఫ్'
● ఎస్పీ అశోక్‌కుమార్ 8

మార్కెట్ సౌకర్యం లేక మామిడి రైతుల ఇక్కట్లు
● రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి 7

తండ్రి మృతిని తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తండ్రి మరణించడంతో తట్టుకోలేక మానసిక క్షోభతో అతని కుమారుడు గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన ఆచంట శివశంకర్(42) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివశంకర్ ఎన్‌టీపీసీలో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. అతని తండ్రి 20రోజుల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆందోళనకు గురయ్యాడని, బుధవారం ఇద్దరు పిల్లలను స్కూల్‌లో దిగబెట్టిన శివశంకర్ ఇంటికి వచ్చాడని, అప్పటికే భార్య టైలరింగ్ చేసేందుకు బయటికి వెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లహరి అలియాస్ వెంగమాంబ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భూమేష్ పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం


నవీన్ (ఫైల్)

ధర్మారం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నెరువట్ల నవీన్ (29) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నవీన్ ప్రవర్తనతో విసుగు చెందిన అతని భార్య పిల్లలు ఇల్లు వదిలివెళ్లిపోయారు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న నవీన్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిచంగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తమ్ముడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ శీలం నరేష్ తెలిపారు.

పాఠాలు చెబుతూ కుప్పకూలిన టీచర్

● ఆసుపత్రిలో మృతి


అనురాధ(ఫైల్)

మల్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న బోగ అనురాధ(43) అనే ఉపాధ్యాయురాలు బుధవారం గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందింది. అనురాధ భోజన విరామం అనంతరం విద్యార్థులకు పాఠాలు చెబుతుండగానే గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పాఠశాల యాజమాన్యం వెంటనే అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేక గుండెపోటుతో మృతిచెందింది. ఉపాధ్యాయురాలి మృతితో పాఠశాలలో విషాదం నెలకొంది.

రిజర్వాయర్‌లో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

గొల్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదాముని‌పల్లె రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి చెరువులో మంగళవారం గల్లంతైన బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతదేహం బుధవారం లభ్యమైంది. రంగదామునిపల్లె గ్రామంలో నేరెళ్ల లక్ష్మీ-పోచయ్య దంపతుల చిన్న కొడుకైన నరేష్ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి మంగళవారం రంగదామునిపల్లె రిజర్వాయర్‌లోకి సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో నరేష్ మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. ఈత నేర్చుకునేందుకు నీటిలోకి దిగిన నరేష్ ఎంతసేపటికీ పైకి రాకపోవడంతో గమనించిన మిత్రులు భయంతో ఊరిలోకి పరుగులు తీసికుటుంబ సభ్యులకు సమాచారమందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ రంగదాముడిపల్లె రిజర్వాయర్‌లోకి గజఈతగాళ్లను దింపి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల జిల్లాప్రధానాసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాడలేని సెంట్రల్ లైటింగ్

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● రాత్రి సమయాల్లో ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు


సెంట్రల్ లైటింగ్ లేకుండా ఉన్న నందికమాన్-కలెక్టరేట్ రోడ్డు

వేములవాడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక వాహనదారుల సౌకర్యార్థం నాలుగు వరసల రోడ్డును ఏర్పాటుచేసినా సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం జంక్షన్ నుంచి వేములవాడకు వచ్చే నందికమాన్ వరకు నాలుగు వరుసల రోడ్డు వేసి మధ్యలో పూలమొక్కలను నాటి అందంగా తీర్చిదిద్దారు. అయితే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకోవడంతో రాత్రి సమయంలో వెలుతురు లేక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు, భక్తులు వాపోతున్నారు.

తప్పని ఇబ్బందులు..

జిల్లా కేంద్రం నుంచి వేములవాడకు వచ్చే వాహనాలు లైటింగ్ లేకపోవడంతో వాహనాదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు హైదరాబాద్ నుంచి సిరిసిల్ల మీదుగా రాజన్న దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో వాహనాల్లో ఆలయానికి వస్తున్నారు. అయితే రాత్రి సమయంలో వచ్చే భక్తులు లైటింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నందికమాన్, గుర్రంవానిపల్లి, అగ్రహారం, చంద్రగిరి గ్రామాలకు చెందిన స్థానికులు రాత్రి సమయంలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టరేట్ నుంచి నందికమాన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, నందికమాన్ నుంచి కొడుముంజ గ్రామం వరకు నాలుగు వరుసల రోడ్డు పూర్తి అయినా మధ్యలో పూల మొక్కలు నాటి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బందులు.. నాగుల రాము, సంకెపల్లి



నందికమాన్ నుంచి సిరిసిల్ల వెళ్లే రోడ్డులో రాత్రి సమయంలో చీకటిమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుర్రంవానిపల్లి సమీపంలో పాదచారులు నడుచుకుంటూ రోడ్డు దాటితే కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

లైటింగ్ ఏర్పాటు చేయాలి..: నేరెళ్ల కిరణ్, తిప్పాపూర్



రాజన్న ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి లైటింగ్ ఏర్పాటు చేసి స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

కట్నం కోసం వేధించిన భర్త, అత్తమామలపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన సంఘటనలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన పోతుల రాజిరెడ్డితో పాటు అతని తల్లిదండ్రులు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని శిరీషకు కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేటకు చెందిన రాజిరెడ్డితో నాలుగేళ్ల కిందట వివాహమైందన్నారు. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.2 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు ఇచ్చి పెళ్లి జరిపించారని చెప్పారు. కొంతకాలం తర్వాత భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలు పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని శిరీషను వేధింపులకు గురి చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

వ్యక్తిపై దాడి కేసులో ఏడాది జైలు శిక్ష

సిరిసిల్లక్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి కేసులో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు టౌన్ సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు. సీఐతెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లపట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అంకారపు ప్రభాకర్ ఇంటికి ఉన్న టులెట్ బోర్డును 4 జూన్ 2017న పాత పగలు దృష్టిలో పెట్టుకొని ఇంటి పక్కన ఉన్న కాముని వనిత, కాముని అరుణ, వడ్డేపల్లి సుజాత అనేముగ్గురు తొలగించారు. దీంతో దుర్భాషలాడుతూ ప్రభాకర్ కర్రతో దాడి చేశాడని కాముని వనిత సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు అప్పటిసిరిసిల్ల ఏఎస్‌ఐ అనంతరెడ్డి అంకారపు ప్రభాకర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ శ్రావణ్ ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేష్ పదిమంది సాక్షు లను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించగా, కేసుపూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ నేరంరుజువు కావడంతో నిందితుడైన అంకారపు ప్రభాకర్‌కు ఒక సంవత్సరం జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించినట్లు సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న రెండువాహనాలను వేర్వేరుప్రదేశాల్లో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. వెంకట్రావుపల్లె గ్రామంలోని కెనాల్ సమీపంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని నిందితుడైన మల్కినగేష్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలోని కందికట్కూర్ గ్రామసమీపంలో ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కందికట్కూర్ గ్రామానికి చెందిన దొమ్మాటి అజయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఈఓకు గాయాలు

తంగళ్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఈవో అనూషకు గాయాలయ్యాయి. కట్కూర్‌ఏఈవో అనూష విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా తంగళ్లపెల్లి మండలకేంద్రంలో కారుఢీకొని స్వల్పంగా గాయాలయ్యాయి.

ఖర్చుల కోసం చోరీలు

● మహిళ నుంచి బంగారం, నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

పెద్దపల్లిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఖర్చుల కోసం ఓ మహిళ చోరీ మార్గాన్ని ఎంచుకుంది. భర్త ఎనిమిదేళ్ల క్రితం మరణించడంతో కొన్నాళ్లపాటు హోటల్‌లో పనిచేసి తన ఇద్దరు కూతుళ్ల వివాహంచేసింది. అప్పులు తీర్చలేక, ఇంటి అవసరాలు వెళ్లదీయలేక దొంగగా మారింది. ఓబంగారం షాపులో చోరీకి పాల్పడి 24గంటల్లో పోలీసులకు చిక్కి కటకటాల పాలైంది. ఈఘటనకు సంబంధించి డీసీపీ వీ కరుణాకర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన లోకిని తిరుమల సోమవారం పట్టణంలోని దేవరకొండ కరుణాకర్ బంగారు ఆభరణాల షాపులో దొంగతనానికి పథకం వేసింది. వెంట సుత్తి, స్క్రూడ్రైవర్ తీసుకువెళ్లి షెట్టర్ తాళం పగుగొట్టి తెరిచింది. కౌంటర్లకు తాళం వేసి ఉండగా స్క్రూ డ్రైవర్‌తో తెరిచి 100గ్రాముల బంగారం, 40వేల రూపాయల నగదు దోచుకెళ్లింది. యజమాని కరుణాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు మల్లేష్, సిబ్బందితో ఓబృందంగా ఏర్పడి క్లూస్‌టీం ఫింగర్ ప్రింట్స్ సీసీ పుటేజీలను పరిశీలించారు. ఓ మహిళ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే తిరుమలను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం ఒప్పుకుంది. ఆమెనుంచి 100గ్రాముల బంగారం నగదు 28వేలరూపాయలు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ టాస్కలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు. వ్యాపారులు, ఇంటియజమానులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి, ప్రభాకర్, అనిల్‌కుమార్, రాజు, రమేష్ ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు మృతి

సైదాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కింద పడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల కనకయ్య (54)అనేగీతకార్మికుడు వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారీకిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

వివాదాస్పదమైన ఎస్సెస్సీ ఇన్విజిలేషన్

● కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి విధులు

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కోరుట్లలోని గౌతమ్ మోడల్‌స్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేషన్ వివాదస్పదంగా మారింది. కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి ఇన్విజిలేటర్ నిర్వహించడం చర్చనీయాంశమైంది. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో ఓ పదో తరగతి విద్యార్థినికి పరీక్ష కేంద్రం కేటాయించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కోరుట్ల పట్టణంలో పనిచేస్తున్నారు. వారికి కూతురు పరీక్షరాస్తున్న కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా విధులునిర్వహించడానికి ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 21నతెలుగు పరీక్షకు ఎక్కువమంది సిబ్బందిని విధులకు కేటాయించడంతో విద్యార్థిని తల్లికి విధులు కేటాయించలేదు. తండ్రిమాత్రం ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించాడు. ఇంగ్లీష్ పరీక్షరోజు కూడా ఆయన విధులకు హాజరయ్యాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలు పరీక్ష రాసే కేంద్రాల్లో తల్లిదండ్రులతో పాటు వారి బంధువులు ఎవరు ఉన్నా ఇన్విజిలేషన్‌కు అనుమతించరు. ఇందుకుగాను ఉపాధ్యాయులు ముందే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. సదరు ఉపాధ్యాయులు తమ కూతురు పరీక్ష రాసే విషయం తెలపకపోవడంతో వారికి విధులు కేటాయించారు. ఈ విషయం ఆలస్యంగా ఈనెల 24న బయటపడినట్లు సమాచారం. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న తోటి ఇన్విజిలేటర్లు ఈ విషయం మండల విద్యాధికారికి నరేశంకు తెలవడంతో వెంటనే సెంటర్‌కు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. సదరు ఇన్విజిలేటర్ నుంచి ఎంఈవో డిక్లరేషన్ తీసుకొని ఉన్నతాధికారులకు నివేదించారు.

● ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ

కోరుట్ల రూరల్: ఎస్సెస్సీ పరీక్షలో ఇన్విజిలేషన్ వివాదస్పదంపై సదరు ఉపాధ్యాయుడికి బుధవారం జిల్లా విద్యాధికారి రాము షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు మండల విద్యాధికారి నరేశం తెలిపారు. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రంలో తన కూతురు పరీక్ష రాస్తున్న విషయంలో జరుగుతున్న వివాదంపై జిల్లా విద్యాధికారి కార్యాలయానికి వచ్చి గురువారం వివరణ ఇవ్వాలని ఇవ్వాలని షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నట్లు ఎంఈవో తెలిపారు.

అన్నారంలో దొంగల బీభత్సం

● తాళం వేసిన ఇళ్లే లక్ష్యం ● మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, ఆభరణాలు చోరీ
● ఒక ఇంటిలో బైక్ అపహరణ ● రంగంలోకి దిగిన క్లూస్ టీం..


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న మూడు ఇళ్లల్లో దొంగలు పడి నగదు, వెండి, బంగారు ఆభరణాలు, బైక్‌ను దొంగిలించారు. ఒక కుటుంబం వారు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లారు. మరొక కుటుంబం వారు తన తమ్ముడి ఇంటిలో పడుకునేందుకు వెళ్లారు. మరో ఇంటిలో పడుకున్న మహిళ పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. రుద్రోజు వెంకటాచారి ఇంటిలో ముప్పావు తులం బంగారం, 18తులాల వెండి పట్టీలు, మధునాల వెంకటమ్మ ఇంటిలో 55తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. పాకాల రాజిరెడ్డి ఇంటి ఆవరణలో పెట్టిన బైక్ ఎత్తుకెళ్లారు. గొట్టిముక్కల విజయ పుస్తెల తాడును తెంపే క్రమంలో మేల్కొన్న మహిళ అరుస్తూ దొంగ వెంబడి పరుగెత్తింది. అయినా ఫలితం లేకపోయింది. బుధవారం సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనానికి గురైన ఇండ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కరీంనగర్ క్లూస్‌టీం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. అనంతరం గ్రామపంచాయతీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ మోటారు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు సమీపంలోని రైతులు చల్ల కిష్టారెడ్డితో పాటు మరో రైతుకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ మోటారు తీగను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి అపహరించుకుపోయారు. సుమారు రూ.5వేల విలువ ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. చోరీపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు


పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్

కరీంనగర్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో, ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కొత్తపల్లి మండలం లోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా మద్యం పట్టుకు న్నారు. కొత్తపల్లి మండలం ఎలగందల్, బావుపేటలో నాలుగు బెల్ట్‌షాపులను సీజ్ చేశారు. రూ.26వేల విలువైన 40,735 లీటర్ల మద్యం పట్టుకున్నారు. నిర్వాహకులు రెడ్డివేని మనోహర్, దండు శంకరయ్య, గాలి రాజేష్, బోనాల దశరథంను అరెస్టు చేశారు.

మిర్చి యార్డులో దొంగతనం

● రూ.80వేలు చోరీ


యార్డులో వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

తిమ్మాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై ఉన్న తిమ్మాపూర్ ఎండుమిర్చియార్డులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి కౌంటర్‌లో ఉన్న నగదును దొంగిలించారు. మిర్చి యార్డు నిర్వాహకుడు మడికంటి శ్రీనివాస్, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ రోజులాగే మంగళవారం కూడా యార్డులో పనులు ముగించుకొని కరీంనగర్‌లోని ఇంటికివెళ్లాడు. బుధవారం ఉదయం ఉదయం తిరిగి యార్డుకు వచ్చిన క్రమంలో కౌంటర్ పగుల గొట్టి ఉంది. అందులో పెట్టిన నగదు లేకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వివేక్‌తోపాటు క్లూస్‌టీం పోలీసులు మిర్చియార్డుకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. యార్డులోఉన్న సీసీ ఫుటేజ్ పరిశీలించగా అందులో ఇద్దరు దొంగలు వచ్చి డబ్బులు దొంగిలించుకు పోయినట్లు గుర్తించారు. రాత్రి మిర్చిలోడ్‌వస్తుందని శ్రీనివాస్ రూ.80వేలు కౌంటర్‌లో పెట్టి వెళ్లాడు. మిర్చిలోడ్ రాకపోవడంతో డబ్బులు అందులోనే ఉండిపోయాయి. వాటినే దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం



మాట్లాడుతున్న విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు విజయ


రామగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని కొండా లక్ష్మణ్ తెలంగాణరాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు డాక్టర్ విజయ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన రత్నాపూర్ కృషి విజ్ఞానకేంద్ర 13వ శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రంలో సాగుతున్న పండ్ల తోటలు, కూరగాయల సాగును క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు గత సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు, వచ్చే సంవత్సరం చేపట్టాబోయే కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు. వ్యవసాయపంటల సాగుతో పోల్చుకుంటే ఉద్యానపంటలు పండ్లు,కూరగాయలు, పూలసాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని విజయ పేర్కొన్నారు. వాటికి అవసరమయ్యే శాస్త్ర,సాంకేతిక సహకారాన్ని విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. సమావేశంలో విశ్వవిద్యాయలం ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీధర్‌సిద్ది, ఉషారాణి, వ్యవసాయసంయుక్త సంచాలకులు అంజనీదేవి, నాబార్డ్ ఏజీఎం ప్రకాశ్, పీడి డీఆర్‌డీఏ కలిందిని జిల్లా పశుపోషణ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు : సీఐ

కరీంనగర్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వినియోగం అనర్థదాయక మని, యువత వాటిజోలికి వెళ్లవద్దని కరీంన గర్ మహిళాథాణా సీఐ పి శ్రీలత అన్నారు. ప్రభుత్వమహిళా డిగ్రీకళాశాలలో ఈరోజు మత్తుపదార్థాల వినియోగం-అనర్థాలపై అవగాహనసదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ శ్రీలత మాట్లాడుతూ లుక్సకంటే బుక్స్ గొప్పవని, తనఅనుభవాలను చెబుతూ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. విద్యార్థులు మత్తుకు బానిసలుకాకుండా ఉజ్వలభవిష్యత్‌ను తీర్చిదిద్దుకో వాలన్నారు. ఒకసారి మత్తుకు బానిసగా మారితే అతని జీవితంతోపాటు కుటుంబం కూడా చిన్నాభిన్నం అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి వరలక్ష్మి మాట్లాడుతూ మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల విలువైన జీవితాలను కోల్పోతూ, కుటుంబానికి, సమాజానికితీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నారని అన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో మత్తుపదార్థాల నిరోధకకమిటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొగిలి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కుక్క మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని పెంపుడు కుక్క మృత్యువాత పడింది. కుక్క యజమాని కంకణాల బాలలింగం ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలలింగం ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ మామిండ్ల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ సమాచారం

ఇక మీ చేతుల్లో..

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల సమాచారం ఇక మీ చేతిలో అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు పెంచింది. ఈ పథకంలో ఇటీవల 163 వైద్య చికిత్సలను కొత్తగా చేర్చింది. మొత్తంగా 1,835 చికిత్సలు చేసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ కార్డును ఆమోదించే ఆసుపత్రుల్లో మాత్రమే ఉచిత వైద్య పొందే అవకాశం ఉంటుంది. మీ సమీపంలో ఏ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు ఉన్నాయనే సమాచారం ఇకపై మొబైల్ ఫోన్, కంప్యూటర్‌లలో సులువుగా తెలుసుకోవచ్చు.

- కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్‌లో ముందుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పోర్టల్ www.rajivarogyasri. telangana.gov.inలోకి వెళ్లాలి. అనంతరం టాప్ సర్వీస్ బార్‌లో కనిపించే హాస్పిటల్స్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అపుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ అనే దానిపై క్లిక్ చేస్తే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. ఈ మూడు ఆప్షన్ల ద్వారా దగ్గర్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులను తెలుసుకోవచ్చు. మీరు ఎంచుకున్న ఆప్షన్లపై క్లిక్‌చేస్తే కొత్తపేజీ ఓపెన్ అవుతుంది. మీరు ఎంచుకున్నదాని ప్రకారం సెర్చ్ ఆప్షన్‌లో మీ జిల్లా, మీ మండలం హాస్పిటల్, స్పెషాలిటీ, ప్రభుత్వ లేదా ప్రైవేటుని ఎంపిక చేసుకోవాలి. అనంతరం అందుబాటులో ఉన్న ఆసుపత్రులు కనిపిస్తాయి. ఆసుపత్రి చిరునామా, ఆరోగ్య మిత్ర సభ్యుల పేర్లు, వారి ఫోను నంబర్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద అందించే సేవల వివరాలు చూడవచ్చు.
- ఇంకా ఏమైనా సమాచారం లేదా సందేహం ఉంటే మీరు వెళ్లాలనుకుంటున్న ఆసుపత్రి ఆరోగ్య మిత్ర సభ్యులను సంప్రదించవచ్చు. అక్కడ మీకు కావలసిన వైద్య సేవలు ఉన్నాయో లేవో తెలుసుకొని, సమయం వృథా కాకుండా చూసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రాజు తెలిపారు.

జిల్లాల వారీగా ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల వివరాలు..

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు కలిపి మొత్తం 52 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, డాక్టర్ భూంరెడ్డి హాస్పిటల్, అమృత నర్సింగ్‌హోం, అపోలోరీచ్, మెడికవర్, సరోజిని హాస్పిటల్, శ్రీరామ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, ఓమెగా సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్, వెంకటేశ్వర కిడ్నీ సెంటర్, చల్మెడ మెడికల్ కాలేజీ, ప్రతిమ మెడికల్ కాలేజీ, సూర్య నర్సింగ్‌హోం, సన్‌షైన్ హాస్పిటల్, సంజీవని నర్సింగ్‌హోం, అక్షయ మల్టీస్పెషాలిటీ, ఆదర్శ హాస్పిటల్, మురుగన్ హాస్పిటల్, శ్రీకృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, రెనీ హాస్పిటల్, వన్ హాస్పిటల్, సీవీఎం హాస్పిటల్, డాక్టర్ శరత్ మ్యాక్స్‌విజన్ ఐ హాస్పిటల్, రిషిక చిల్డ్రన్స్ హాస్పిటల్ జమ్మికుంట, హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి (ప్రభుత్వ), జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వ)

జగిత్యాల జిల్లాలో..


జిగిత్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, గీతా ఆర్థోపెడిక్, మెటర్నిటీ నర్సింగ్ హోం, అమృత, త్రినేత్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, సాయి సంజీవని హాస్పిటల్, శివసాయి హాస్పిటల్, పావని ఐ హాస్పిటల్, తిరుమల నర్సింగ్‌హోం, ఓం సాయిరాం మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెట్‌పల్లి (ప్రభుత్వ), ధర్మపురి ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), కోరుట్ల ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), రాయికల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, గంబీరావుపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, వేములవాడ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఎల్లారెడ్డిపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, సిరి హాస్పిటల్, అశ్విని హాస్పిటల్

పెద్దపల్లి జిల్లాలో....

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రామగుండం, మంథని ఏరియా ఆసుపత్రి, పెద్దపల్లి ఏరియా ఆసుపత్రి, సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, విజయ హాస్పిటల్.



రాజన్న హుండీ ఆదాయం రూ. 1.95 కోట్లు

బంగారం 287 గ్రాములు, వెండి 18.5 కిలోలు

వేములవాడ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత నడుమ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 రోజుల హుండీలను బుధవారం లెక్కించారు. నగదు రూ కోటి 95 లక్షల 75 వేల 168 లభించగా, 287 గ్రాముల బంగారం, 18.500 కిలోల వెండి లభించింది. అలాగే నాంపల్లి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో 6 నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ 11 లక్షల 47వేల 510 అదాయం లభించింది. హుండీ లెక్కింపును ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేములవాడలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అంజన్న హుండీ ఆదాయం రూ1.09కోట్లు

మల్యాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,09,13,339నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. 55 రోజులకుగాను ఆలయంలోని 12 హుండీలను బుధవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 109 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్,అధికారులు, సిబ్బంది, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొండగట్టులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

హుండీల్లోనే బంగారం, వెండి

ఇన్నాళ్లు హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ఈ సారి వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్ చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. వాటిని మరోసారి జరిపే హుండీల లెక్కింపు సందర్భంగా దేవాదాయ శాఖ జువెలరీ అధికారుల సమక్షంలో తూకం వేయడానికి గాను సీజ్ చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. గతంలో లేని విధంగా మళ్లీ హుండీలలోనే సీజ్ చేసి వేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యం..

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ● రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటన





సిరిసిల్లలో పర్యటిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బృందం, వేములవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్

సిరిసిల్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఫలాలు బీసీలందరికి అందించడమే లక్ష్యమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్, గీతానగర్‌లలో పర్యటించారు. పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి తదితర కులాల స్థితిగతులను తెలుసుకునే దిశగా వారితో సమావేశం అయ్యారు. తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడంతో అర్చక, ఇతర ఉద్యోగాల్లో ఇబ్బందులు పడుతున్నామని తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కులం సర్టిఫికెట్‌లలో తమ కులం పేరును వంశీయులుగా మార్చాలని దొమ్మరి కులం బాధ్యులు కోరారు. దొమ్మరి కులం పేరు ఉండడంతో సమాజంలో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వ సంస్థలు, విద్యాలయాల్లో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కులం పేరు సమస్యపైనే అధ్యయనం చేయడానికి వచ్చామని కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీసీ సంక్షేమ అధికారి రాజమనోహర్‌రావు, తదితరులు ఉన్నారు.

వెనుకబడిన కులాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం

వేములవాడ : బీసీ సామాజిక వర్గంలోని వెనుకబడిన కులాలైన పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులపై రాష్ట్ర బీసీ కమిషన్ సమగ్ర అధ్యయనం చేస్తున్నదని కమిషన్ చైర్మన్ జి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయనతో పాటు కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు న్యూ అర్బన్ కాలనీలో వెనుకబడిన సామాజిక వర్గమైన పిచ్చగుంట్ల కులానికి చెందిన పలువురి ఇళ్లను సందర్శించి వారి జీవన స్థితిగతులను, జీవనోపాధి కోసం వారు పడుతున్న కష్టాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని వెల్లడించారు. కులం పేరును విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ఇప్పుడున్న కులాల పేర్లకు ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని ఆయా కులాల నుంచి విజ్ఞప్తులు అందాయని తెలిపారు. సమగ్ర అధ్యయనం అనంతరం వచ్చే నెల రెండో వారంలో జరిగే బీసీ కమిషన్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యంలో బిల్లు చట్టరూపం దాల్చాలని రాజరాజేశ్వర స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వచ్చే నెల 3 వరకు రైల్వే గేటు మూసివేత

కొడిమ్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్-అప్పారావుపేట గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటును మరమ్మతు పనుల దృష్ట్యా గురువారం నుంచి ఏప్రిల్ 3 వరకు గేట్ మూసివేయ నున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని బుధవారం సంబంధిత గ్రామ పంచాయతీల అధికారులకు, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారమందించారు. రైల్వే గేటు మరమ్మతు విషయమై నోటీసు అందినట్లు కొడిమ్యాల తహసీల్దార్ జి.రమేష్, పూడూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి తెలిపారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ..

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కరీంనగర్ నుంచి హుజురాబాద్ వైపు వస్తున్న లారీ గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వపై ఉన్న వంతెనపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసం కాగా ఎవరికీ ప్రమాదం జరగలేదు. ప్రమాదంలో ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రాకపోకలను పునరుద్ధరించారు.

మార్కెట్ సౌకర్యం లేక మామిడి రైతుల ఇక్కట్లు

రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో మామిడికి మార్కెట్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా మామిడి తోటల విస్తీర్ణం రాయికల్ మండలంలోనే ఉంది. ప్రతియేటా జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలకు మామిడిని రైతులు తరలించి విక్రయిస్తున్నారు. స్థానికంగా కొనుగోలు కేంద్రం లేక పోవడంతో రైతులకు రవాణా భారం పడుతోంది. రాయికల్ మండల వ్యాప్తంగా 4300 మంది రైతులు 10,500 ఎకరాల్లో మామిడి పంటలు సాగు చేస్తున్నారు. మూటపెల్లి, కొత్తపేట, భూపతిపూర్, రామాజీ పేట, ఒడ్డెలింగాపూర్, చింతలూరు, తాట్లవాయి, అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట గ్రామాల్లో అత్యధికంగా మామిడి తోటలు ఉన్నాయి. ప్రతి యేటా రైతులు విక్రయాలకు పట్టణ ప్రాంతాలకు తీసుకువెళ్లడం, అక్కడ రేటు వచ్చేదాకా వేచి ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగ్‌పూర్ తదితర మార్కెట్‌లలో రేటు వచ్చే దాకా రైతులు జగిత్యాల మార్కెట్‌లో నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో పలువురు రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్ట పోతున్నారు. రాయికల్ మండల కేంద్రంలో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్రం ఏర్పాటుతో రవాణా భారం తప్పడంతో పాటు రాయికల్, మల్లాపూర్, మేడిపల్లి మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల రైతులు కోరుతున్నారు.



మామిడి తోట

రవాణా భారం తప్పుతుంది

రాజేందర్, రైతు, చెర్లకొండాపూర్



మామిడి విక్రయాలకు సుమారు 30 కి.మీ. తీసుకువెళ్లడానికి వాహనాలు సమకూర్చాలంటే సుమారు ఒక్కో వాహనానికి ట్రిప్పుకు రూ.5 వేలు ఖర్చు అదనంగా అవుతుంది. రాయికల్ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా భారం తీరుతుంది.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎలగందుల ఉదయశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్



జిల్లాలోనే రాయికల్ మండలంలో రైతులు అత్యధికంగా మామిడి పంట సాగు చేస్తున్నారు. రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో రైతులకు ప్రయాణ భారం తగ్గుతుంది. మామిడి కొనుగోళ్లకు మండలం కేంద్ర బిందువుగా మారితే రైతులకు ప్రోత్సాహం లభిస్తుంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలి.

గుడి లేని దేవుడు

- రాతిపై వెలిసిన ఆదివరాహస్వామి
- ఏటా పెరుగుతూ వరాల స్వామిగా ప్రసిద్ధి
- ఈ నెల 30న ఉగాది సందర్భంగా ఉత్సవాలు

కమాన్‌పూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో వెలసిన ఆదివరాహస్వామి వరాల స్వామిగా భక్తుల కోరికలు నెరవేరుస్తున్నాడు. బండి రాతిపై వెలసిన స్వామివారికి గుడి లేదు. ఆరు బయటనే ఉండి నిత్యం భక్తుల పూజలు అందుకుంటారు. ఏటా స్వామివారి పరిమాణం పెరుగుతున్నట్లు ఇక్కడి భక్తులు చెప్పుకుంటారు. సుమారు 600 సంవత్సరాల క్రితం ఒక మహా రుషి తపస్సును మెచ్చి ప్రత్యక్షమైన శ్రీహరి, ఆ ఋషి కోరిక మేరకు ఆదివరాహస్వామి రూపంలో వెలసి భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నట్లు ప్రతీతి. స్వామి వారి రాతి విగ్రహం, ప్రతిఏటా పెరుగుతూ వస్తుండడం ఇక్కడి ప్రధాన ప్రత్యేకత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు మాత్రమే ఆది వరాహస్వామి ఆలయాలు ఉండగా, శ్రీవారు కొలువై ఉన్న తిరుమల ప్రాంతంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలంలో ఉన్న ఈ ఆలయం రెండోదిగా ప్రాచుర్యం పొందింది.



బండల మధ్యనే ఆదివరాహస్వామి వారి ఆలయం

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

స్వామివారిని దర్శించుకోవాలంటే కరీం నగర్ నుంచి గోదావరిఖనికి కమాన్‌పూర్ మీదుగా వెళ్లే ప్రత్యేక బస్సులుంటాయి. కరీంనగర్ నుంచి కమాన్‌పూర్ మీదుగా పెద్దపల్లికి ఆర్టీసీ బస్సులు వెళ్తాయి. దేవాలయానికి దగ్గరగా ఉన్న రైల్వేస్టేషన్ పెద్దపల్లి. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులు, ఆటోల సౌకర్యం కూడా ఉన్నది.





రాతిపై స్వామివారు, ఆలయం ముఖద్వారం

ప్రతి మాసంలో కల్యాణం

భక్తుల కోరిక మేరకు ప్రతి మాసంలో కల్యాణం నిర్వహిం చేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ప్రతి మాసంలో ఆదివరాహ స్వామి కల్యాణం నిర్వహించడం వల్ల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. ప్రతి ఉగాదితో పాటు, శ్రావణ మాసంలో స్వామివారి జయంత్యోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఈ యేడు ఉగాదికి ప్రత్యేక పూజలు చేపట్టినట్లు తెలిపారు.

సీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర స్థాయి కాయకల్ప బృందం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్రస్థాయి కాయకల్ప బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. రాష్ట్రస్థాయి బృందం, సిద్దిపేట జిల్లా నంగునూర్‌లోని సీహెచ్‌సీ వైద్య అధికారులు మంజుల, శ్రావణి, శ్వేత, లిఖితలు ఆరోగ్య కేంద్రంలోని పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్, స్థానిక వైద్యులు అజయ్‌కుమార్, బాబు, రఘు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఆర్టీసీ డీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కల్పన బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్య ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈకార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

రాయికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మూటపెల్లి గ్రామానికి చెందిన జైత నారాయణ ఇటీవల దుబాయ్‌లో మరణించగా ఎల్లాల శ్రీనన్న సేవా సమితి సభ్యులు డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డికి వివరించగా బుధవారం వారి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్ రెడ్డి, మండ రమేష్, సంగం రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

రాయికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన చడాల గంగారెడ్డి కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా ఆయన భార్య జ్యోతికి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.2 లక్షల 50 వేల బీమా చెక్కును బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ జగిత్యాల డివిజనల్ మేనేజర్ మూల అనిల్, సీనియర్ టెర్రిటరీ మేనేజర్ పల్లికొండ రాజేందర్, సీనియర్ అడ్వైజర్‌లు గొల్లపెల్లి హరీష్, హరికృష్ణ, నరేష్, లత, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ మహేశ్వర్ రావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

భీమారం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడెం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రూ.35 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మల్లన్న ఆలయం, రేణుకా ఎల్లమ్మ గుడి, ప్రభురాయుడి గుడికి కావాల్సిన సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేలు నరేష్, నర్సింగారావు, గంట గంగరాజం, మహిపాల్‌రెడ్డి, వడ్ల గంగాధర్, హరీష్, ఉమ్మడి రవి, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

మల్లాపూర్, మార్చి, 26 (ఆంధ్రజ్యోతి) :మల్లాపూర్ మండలంలోని ఓబులపూర్ తండా శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీవో సతీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కూలీలు పనులు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండదెబ్బ తగలకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో 1450 మంది కూలీలు ఉపాధి పనులలో పాల్గొన్నట్లు వివరించారు. ఈయన వెంట ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

ప్రయాణికుల భద్రతకు 'మై ఆటో ఈజ్ సేఫ్'

-ఎస్పీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, మార్చి, 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు మై ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని వీఆర్‌ఎమ్ గార్డెన్‌లో మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆటోల్లో ప్రయాణించే వారికి పూర్తి భద్రత, భరోసా కల్పించడమే పోలీసు లక్ష్యమని అన్నారు. అనంతరం ఆటోలకు మై ఆటో ఈజ్ సేఫ్‌కు సంబంధించిన యాప్ స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2500లకు పైగా ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేశామన్నారు. ప్రయాణికులు ప్రయాణించే మొదటగా ఆటోకు ముందు, వెనుక, డ్రైవర్ సీట్ వెనకాల కనిపించే విధంగా వేసిన మై ఆటో ఈస్ సేఫ్ అనే స్టిక్కర్‌ను గమనించాలన్నారు. ఏమైనా సమస్య ఎదురైతే కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే ఆ ఆటో డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్‌లో కనిపించిన వెంటనే ఎమర్జెన్సీ కాల్ ఆప్షన్ వస్తుందన్నారు. పోలీసులు సమాచారం ఆధారంగా సంఘటన స్థలానికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని రక్షిస్తారన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, రాజుకుమార్, వెహికిల్ ఎస్సై శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులపై దృష్టి సారించాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత


ఎల్‌ఆర్‌ఎస్ రసీదు పత్రాలను అందిస్తున్న అదనపు కలెక్టర్ లత

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విధించిన గడువులోగా పట్టణంలో వంద శాతం ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ లత బల్దియా అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆమె ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులలో నమోదు వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్ను వసూలు విషయం ఆరా తీశారు. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించే విధంగా భూ యజమానులను ఎప్పటికప్పుడు చైతన్య వంతులను చేస్తూ ప్రభుత్వ లక్ష్యం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్‌లో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించడానికి వచ్చిన యజమానులకు రశీదు పత్రాలను అందించి వారికి ప్రభుత్వ నియమావళిని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి

ధర్మపురి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్


కమిషనర్ కల్లెడ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ తెలిపారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా చేరిన రాజశేఖర్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలు గురించి చర్చించారు. అనంతరం ఆయనకు నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలో డంపింగ్ యార్డ్, తాగు నీటి సమస్య గురించి చర్చించారు. దీంతో స్పందించిన ఆయన ఇక్కడ నెలకొన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణ గురించి ప్రయత్నించడం హర్షించదగ్గ విషయమన్నారు. పట్టణ ప్రజల తరఫున కమిషనర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవణ్‌కుమార్, దివిటి శ్రీధర్, మండలోజు సూరజ్, కాశెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సజావుగా ఎన్నికలను నిర్వహించడంపై పలు ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు, గత ఎన్నికల్లో ఎదురైన అనుభావాలపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి హకీం, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో భూపతిపూర్ గ్రామస్థులు

రాయికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మండలంలోని భూపతిపూర్ శ్రీ రామ సేవా సమితి సభ్యులు గోనె రాములు ఆధ్వర్యంలో గ్రామస్థులు రాజన్న సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 12 మంది స్వామివారి హుండీ లెక్కింపులో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రొండ్ల రమేష్, రొండ్ల లక్ష్మి, గోనె లక్ష్మి, కామని ప్రవీణ్, కామని నవ్య, మాసపాట రాజేందర్, మంజుల, లక్ష్మి, లక్ష్మణ్ రావు, స్వర్ణలత, రాజేందర్, మేఘన తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేద్కర్ సంఘం సమావేశం

పెగడపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బాబాసాహెబ్ అంబేద్కర్ జయంత్యుత్సవాలను విజయవంతంపై శుక్రవారం పెగడపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలె అంజయ్య, బత్తుల ప్రదీప్‌లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని సంఘాల నాయకులు పాల్గొని అంబేద్కర్ జయంతోత్సవ కమిటీని ఎన్నుకోనున్నట్లు ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పేదలకు సన్న బియ్యం

(5వ పేజీ తరువాయి)

డీలర్ పాయింట్లకు చేర్చుకోవాలని చెప్పారు. బియ్యం పంపిణీ విషయంలో రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించినట్లు తెలిసింది.

● దొడ్డు బియ్యం నిల్వలపై దృష్టి

రేషన్ డీలర్ల వద్ద మిగిలిపోయిన దొడ్డు బియ్యం నిలువల్లో ఏమైనా తేడా ఉందా.. లెక్కలు పక్కాగానే ఉన్నాయా అనే కోణంలో అధికారులు పరిశీలన జరుపుతున్నారు. ఈనెల 20వ తేదీన బియ్యం పంపిణీ ముగిసిపోయిన తరువాత ఈ-పాస్ యంత్రంలో నమోదైన లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 55 నుంచి 60 మెట్రిక్ టన్నుల వరకు మిగిలిపోయిన దొడ్డు రకం బియ్యం నిల్వలు ఉండాలన్న అంచనా ఉంది. పలు చోట్ల బియ్యం నిలువ ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నా వాస్తవానికి బియ్యం నిలువల్లో తేడాలున్నాయా అన్న అంశంపై అధికారులు దృష్టి సారించారు.

సన్న బియ్యం ఇస్తే సంతోషం

-అడిగొప్పుల రజిని, గృహిణి, మెట్‌పల్లి



రేషన్‌షాపుల్లో ఇచ్చే దొడ్డు బియ్యం అన్నం ముద్దగా ఉండటం, అరగక పోవడంతో సన్న బియ్యం కొని తింటున్నాం. దీంతో చేసిన కష్టంలో సగం డబ్బులు బియ్యానికే ఖర్చు అవుతున్నాయి. ఇప్పుడు రేషన్‌బియ్యం సన్నవి ఇస్తే సంతోషంగా వినియోగించుకుంటాం.

రేషన్ దుకాణాలకు సన్న బియ్యం వస్తోంది

-గాజెంగి నందయ్య, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు



జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడు రోజులుగా సన్నబియ్యం రేషన్ దుకాణాలకు వస్తోంది. ప్రభుత్వం సన్నబియ్యం ఇవ్వడం మంచి నిర్ణయం. గతంలో కొందరు దొడ్డు బియ్యం వినియోగించే వారు కాదు. ప్రస్తుతం సన్నబియ్యం ఇవ్వడం వల్ల సంపూర్ణంగా వినియోగం అయ్యే అవకాశాలున్నాయి.

ప్రభుత్వ నిర్ణయం మేరకు పంపిణీ

-బీఎస్ లత, అదనపు కలెక్టర్




పేదలకు సన్నబియ్యం అందించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం పూర్తిగా వెనక్కి తీసుకోవాలని సూచించింది. ఆ దిశగా డీలర్లకు ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాల పాయింట్లకు సన్నబియ్యం సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.

విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి


మురళిని సన్మానిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

మెట్‌పల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ మనుమయులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అయిల సత్యం, ప్రధాన కార్యదర్శి సంకోజు వెంకటరమణలు అన్నారు. బుధవారం పట్టణంలోని మనుమయ సంఘ భవనంలో సంఘ పట్టణ నూతన కమిటీ అధ్యక్షుడిగా కొండ మురళి, ఉపాధ్యక్షుడిగా ఎదులాపురం కుమార్, కార్యదర్శిగా ఇంద్రాల ఈశ్వర్, కోశాధికారిగా మద్దెనపల్లి స్వామిలతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అయిల సత్యం, వెంకటరమణలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వడ్రంగి కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కుంగిన వైకుంఠధామం ద్వారం


ఒక వైపు కుంగిపోయిన ద్వారం


కాలువలో కొట్టుకుపోయిన అడుగుభాగం

మల్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని గొర్రెగుండంలో నిర్మించిన వైకుంఠధామం ద్వారం ఒక పక్కకు వంగిపోయింది. స్వాగత ద్వారం పక్కన గల కాలువలో గేట్‌కు సంబంధించిన ఒక పిల్లరు నిర్మించడంతో అడుగుభాగం నీటి ఒత్తిడికి కొట్టుకుపోయింది. దీంతో ప్రస్తుతం ద్వారం ప్రమాద కరంగా మారింది. అధికారులు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభం

మల్యాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో ఎకరాకు రూ.లక్ష ఆదాయం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ అన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ సూచించారు. మండలంలోని మానాలో బుధవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి ముప్పై సంవత్సరాల వరకు దిగుబడి ఉంటుందని తెలిపారు. రైతులకు మొదటి నాలుగు సంవత్సరాలు రూ.4200చొప్పున ప్రోత్సాహకం అందించడం జరుగుతుందని వివరించారు.

రక్షణ కల్పించాలని వినతి

మల్యాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామ పరిధిలో గల ఊర చెరువులో చేపలు పట్టుకోవడానికి రక్షణ కల్పించాలని గొల్లపల్లి, పోతారం, గొర్రెగుండం, మద్దుట్ల మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో పోలీసులకు వినతిపత్రం అందజేశారు. కొన్నాళ్లుగా ఈ చెరువులో చేపలు పట్టుకోవడంపై వివాదం నెలకొనగా తమ సంఘంలో సభ్యులు కాని వారు చేపలు పట్టకుండా అడ్డుకుంటున్నారన్నారు. చేపలు పట్టుకోవడానికి తమకు జిల్లా మత్స్యశాఖ అధికారి తమకు అనుమతులు ఇచ్చారని ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు తెలిపారు. మల్యాల, కొడిమ్యాల మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి వినతిపత్రం అందించారు.

లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణం

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మి నారాయణ దేవాలయం 35వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం స్వామి వారి కల్యాణంను వేదపండితులు బరద్వాజ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు ప్రత్యేక వేదికపై స్వామి కల్యాణంను జరిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్, వార్డు మాజీ సభ్యురాలు శీలం జయ-వేణుగోపాల్, వార్డు మాజీ సభ్యురాలు పుప్పాల ఉమాదేవి-ప్రభాకర్‌లతో పాటు ముత్యాల సంఘ సభ్యులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కోరుట్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులను నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నాగులపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. గ్రామంలో నర్సరీతో పాటు ఉపాధి హామీలో నిర్వహిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు.

గుంతలరోడ్డుతో ప్రయాణికుల ఇక్కట్లు

-మరమ్మతు చేయించాలని వాహనదారుల వినతి


గుంతలమయమైన రహదారి

కొడిమ్యాల, మార్చి26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న కొడిమ్యాల మండలంలోని దొంగలమర్రి (జేఎన్‌టీయూ) పోలీస్ చెక్‌పోస్ట్ దగ్గర రోడ్డు గుంతల మయంగా తయారైంది. దీంతో వాహనాలు నడపడం ఇబ్బందిగా తయారైందని పలువురు వాహన చోదకులు తెలిపారు. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుపై నుంచి వెళ్తుంటాయి. మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ, జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజనేయస్వామి ఆలయానికి గుట్టపైకి వాహనాలు ఈ దారి గుండా రాకపోకలు సాగించ చడంతో దొంగలమర్రి బస్‌స్టేజీ వద్ద ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఎక్కువ మంది దొంగలమర్రి నుంచి కరీంనగర్ వైపు వెళ్తుతున్నారు. జగిత్యాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు దొంగలమర్రి చెక్ పోస్ట్ నుంచి వస్తాయి. దీంతో ఈ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళల్లో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు చేయించాలని సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులను, వాహనాల చోదకులు, మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

అన్ని సంఘాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని సంఘాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కోర్టు ప్రాంతంలోగల మున్నూరుకాపు సంఘ భవన అభివృద్ధి కొరకు మంజూరు అయిన రూ.2లక్షల ప్రొసీడింగ్ పత్రాలను సంఘ సభ్యులను కాంగ్రెస్ నాయకులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ రావు మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సంఘ భవన అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేసి కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావును సంఘ సభ్యులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్‌లతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్


బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల అర్బన్, మార్చి (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా పర్యటనకు వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమల గిరి సురెందర్‌లను కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌తో పాటు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్ కలిసారు. గురువారం జిల్లా కేంద్రంతో పాటు ధర్మపురి నియోజకవర్గంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పర్యటించనున్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న అధికారులు

కోరుట్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులోని గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలింపును గనులు, రెవెన్యూ శాఖ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం గ్రామ శివారులోని గుట్ట వద్ద అక్రమంగా మట్టి తవ్వుతున్నారని కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేయగా స్పదించిన కలెక్టర్ గనుల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా గనుల శాఖ అధికారి జైరాంసింగ్ ఆధ్వర్యంలో దాడులను నిర్వహించారు.

ప్రొక్లెయిన్ సహాయంతో తవ్వుతుండగా పట్టుకొని దాన్ని స్వాధీనం చేసుకున్నారు. మట్టిని తరలిస్తున్న వాహనాలపై విచారణ చేపట్టినట్లు జిల్లా అధికారి జైరాంసింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రావులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాదిగలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పలువురు నేతలు వినతిపత్రం అందించారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో అకాల వర్షాలతో నష్ట పపోయిన రైతులను ఆదుకోవాలని జగిత్యాల జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యానారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి నాయకులు పెద్ద గంగారాం, ఇట్నేని రమేష్, కాయితి శంకర్, రాపర్తి రాజు, కొడు వెంకన్న, జక్కుల మహేష్, పుప్పాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.